
# సాక్షి ఖమ్మం

బుధవారం । 20 । ఆగస్టు । 2025



**జమలాపురానికి దేవుడే దిక్కు**

జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాలకవర్గం లేక.. నిధులు రాక అభివృద్ధిలో ముందడుగు పడడం లేదు. 8లో




**గ్రానైట్ పరిశ్రమ రక్షణకు..**

జిల్లాలో వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమ రక్షణకు ఐక్య ఉద్యమాలు చేయాలని నాయకులు నిర్ణయించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 24°

**వాతావరణం**

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### గడువులోగా సీఎంఆర్ డెలివరీ

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం సహకారనగర్:** నిర్ణీత గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) పంపిణీ పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అధికారులు, రైస్‌మిల్లర్లతో సమీక్షించారు. 2024–25కు సంబంధించి సీఎంఆర్ డెలివరీ గడువును ప్రభుత్వం నెల పాటు పొడిగించినందున, సెప్టెంబర్ 12వరకు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. అలాగే, ఖరీఫ్ సీజన్‌లో ఇవ్వాల్సిన 1.98 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌లో 1.69 మెట్రిక్ టన్నులు ఇచ్చినందున మిగతా కూడా త్వరగా సరఫరా చేయాలని సూచించారు. డీసీ ఎస్‌ఓ చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

### పంటల కనీస మద్దతు ధర పెంపు

**ఖమ్మంవ్యవసాయం:** కేంద్ర ప్రభుత్వం 2025–26 సంవత్సరానికి పంటల కనీస మద్దతు ధర పెంచిందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధరల వివరాలను ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. వరి కామన్ రకం క్వింటాకు రూ.2,369, గ్రేడ్–ఏ రకం రూ.2,389, జొన్నలు హైబ్రిడ్ రూ.3,699, సజ్జలు రూ.2,775, మొక్కజొన్నలు రూ.2,400, కందులు రూ.8వేల, పెసలు రూ.8,768, మినుములు రూ.7,800, వేరుశనగ రూ.7,263, నువ్వులు రూ.9,846, పత్తి రూ. 8,110గా ధరలు నిర్ణయించారని తెలిపారు. ఈమేరకు రైతులు పంట ఉత్పత్తులను ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తూ కనీస మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ సూచించారు.

### 'నవోదయ'లో ముగిసిన కళా ఉత్సవ్



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

**కూసుమంచి:** పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్లస్టర్ స్థాయి కళా ఉత్సవ్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీప్రసాద్ ప్రశంసాపత్రాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థుల్లో కళానైపుణ్యాన్ని వెలికితీసేలా పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఎంఈఓ బీ.వీ. రామాచారి మాట్లాడగా విద్యాలయ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు, వివిధ జిల్లాల నవోదయ విద్యాలయాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### దుమ్ము, ధూళి నియంత్రణపై పర్యవేక్షణ



సీహెచ్‌పీ ఆవరణలో పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్, అధికారులు

**సత్తుపల్లిరూరల్:** బొగ్గు రవాణా సమయంలో దుమ్ము, ధూళి నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. బొగ్గు నిల్వచేసే సైలోబంకర్, లోడింగ్ విధానాన్ని పరిశీలించి మాట్లాడారు. ధూళి నియంత్రణ కు అత్యాధునిక పరిజ్ఞానాన్ని అమలుచేయాలని తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఓసీ పీఓ ప్రహ్లాద్, సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ డీజీఎం సోమశేఖర్‌రావు, ఇంజనీర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం**

సత్తుపల్లిలో సోమ, మంగళవారం కురిసిన వర్షం కారణంగా జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రెండు ఓసీల్లో 30వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 92వేల మెట్రిక్ టన్నుల మట్టి తొలగింపు నిలిచిపోయిందని అధికారులు తెలిపారు.

# ఆమెకు కడుపుకోత



**జిల్లాలో సాధారణ ప్రసవాల సంఖ్య** నానాటికి తగ్గుతోంది. కాసుల కక్కుర్తితో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు సాధారణ ప్రసవాలకు అవకాశం ఉన్నా ఆపరేషన్లు చేస్తున్నారని తెలుస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం తప్పని సరిగా సాధారణ ప్రసవాలే నిర్వహించాలని ఆదేశించినా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో మూడు వంతులకుపైగా సిజేరియన్లు జరుగుతుండగా.. ఆ ప్రభావం తల్లి ఆరోగ్యంపై పడుతోంది. అలాగే, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ సాధారణ ప్రసవాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

– ఖమ్మం వైద్యవిభాగం

**ప్రసవానికి వెళ్తే ఆపరేషనే...**

- ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ ఆస్పత్రుల తీరు
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- కొన్ని సర్కారు ఆస్పత్రుల్లోనూ మారని తీరు

**మూడున్నర ఏళ్లలో 6వేలే సాధారణం**

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాల్లో అత్యధికం ఆపరేషన్లే ఉండడం ఆరోపణలకు తావిస్తోంది. గర్భంలో పిండం అడ్డం తిరిగిందని, శిశువు ఉమ్మనీరు మింగిందనే కారణాలు చెబుతూ సిజేరియన్లు చేస్తున్నారు. అలాగే గర్భిణులకు ప్రసవ సమయాన బీపీలో హెచ్చుతగ్గుల కారణంగా ఎదురయ్యే సమస్యలతోనూ ఆపరేషన్‌కే మొగ్గు చూపుతున్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో 2022–23 నుంచి ఇప్పటి వరకు 22,741 ప్రసవాలు జరగగా.. ఇందులో 6,081 మాత్రమే సాధారణ ప్రసవాలు ఉండడం నిర్వాహకుల వైఖరిని తెలియజేస్తోంది. సాధారణ కాన్పుతో పెద్దగా ప్రయోజనం ఉండదనే దురుద్దేశంతో సిజేరియన్ల వైపే మొగ్గు చూపి డబ్బు దండుకుంటున్నట్లు సమాచారం. సిజేరియన్‌కు సాధారణ ఆస్పత్రుల్లో రూ.50 వేలకు పైగా వసూలు చేస్తుండగా, కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.లక్ష నుండి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. దీనికి తోడు కొందరు తల్లిదండ్రులు బిడ్డకు జన్మనిచ్చేందుకు మంచి ముహూర్తం చూడడాన్ని ఆనవాగా చేసుకుని సిజేరియన్లు చేస్తున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఆపరేషన్ చేయాలనే నిబంధన ఉన్నా ప్రభుత్వ ఆదేశాలు తుంగలో తొక్కుతుండడంతో అటు తల్లి, ఇటు బిడ్డ ఆరోగ్యంపైనా ప్రభావం పడుతోందని నిపుణులు చెబుతున్నారు.

**సర్కార్ ఆస్పత్రులదీ అదేబాట**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా జిల్లాలో ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ కిట్ ప్రవేశపెట్టడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు గణనీయంగా పెరిగాయి. కానీ కొంత కాలంగా ఆ సంఖ్య తగ్గుతుండడం.. జరుగుతున్న డెలివరీల్లోనూ ఆశించిన స్థాయిలో సాధారణ ప్రసవాలు ఉండడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రసవాలు ఎక్కువ జరిగేలా చర్యలు తీసుకుంటున్నా ప్రైవేట్ ఆస్పత్రులను మాత్రం అధిగమించలేకపోతున్నారు.

**నోటీసులు.. వివరణలు**



సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చి కారణాలపై రాతపూర్వకంగా వివరణ తీసుకుంటున్నాం. అలాగే, సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని ఆదేశించాం. ఈ విషయంలో తరచుగా తనిఖీలు చేపడుతాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ సాధారణ ప్రసవాలు పెంచడం, ప్రైవేట్‌కు దీటుగా డెలివరీలు జరిగేలా కృషి చేస్తున్నాం.

– డాక్టర్ చందూనాయక్, డీఐఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

**జిల్లాలో గత నాలుగేళ్లుగా ప్రసవాల వివరాలు**

| ఏడాది | ప్రభుత్వ ఆస్పత్రులు | | ప్రైవేట్ ఆస్పత్రులు | |
|---|---|---|---|---|
| | సిజేరియన్లు | సాధారణ ప్రసవాలు | సిజేరియన్లు | సాధారణ ప్రసవాలు |
| 2022-23 | 5,069 | 4,785 | 6,972 | 2,033 |
| 2023-24 | 4,344 | 4,272 | 6,994 | 1,745 |
| 2024-25 | 3,623 | 3,550 | 7,014 | 1,902 |
| 2025-26 | 1,084 | 1,050 | 1,761 | 411 |

(ఈనెల 18వరకు)

# లక్ష్యం మేర వన మహోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, అధికారులు

- సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తత
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మంమయూరిసెంటర్:** వనమహోత్సవం కింద శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాల మేరకు నెలాఖరు లోగా మొక్కలు నాటాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంగళవారం ఆయన వనమహోత్సవం, సీజనల్ వ్యాధుల కట్టడి, ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి, ఇందిరా గిరి జలవికాసం, జల్ జీవన్ మిషన్, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 35.32లక్షల మొక్కలకు గాను 25.71 లక్షల మొక్కలు నాటినందున మిగతావీ పూర్తిచేయాలన్నారు. అలాగే, సీజనల్ వ్యాధుల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇక 16,474 ఇందిరమ్మ ఇళ్లలో 12వేలకు మార్కింగ్ పూర్తయినందున నిర్మాణంలో వేగం పెరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు ప్రభుత్వ కార్యాలయాల నుంచి ప్రతిపాదనలు సేకరించాలని సూచించిన కలెక్టర్... పారిశుద్ధ్య పనులపై చర్చించారు. అలాగే, ఇందిరా గిరి జల వికాసం ద్వారా పోడు పట్టా కలిగిన రైతుల పొలాల్లో సోలార్ పంప్‌సెట్ల ద్వారా మోటార్ అమర్చితే జిల్లాలో 11,786 మందికి లబ్ధి జరుగుతుందని తెలిపారు. ఆతర్వాత నీటి సరఫరా, హాస్టళ్లలో టాయిలెట్ల నిర్మాణం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, డీపీఓ ఆశాలత, ట్రాన్స్‌కో, పీఆర్, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈలు శ్రీనివాసాచారి, శేఖర్‌రెడ్డి, రంజిత్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

# విద్యుత్ లైన్లతో అప్రమత్తత

**ఖమ్మంవ్యవసాయం:** వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే వారు విద్యుత్ లైన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి సూచించారు. ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల కింద మండపాలు ఏర్పాటుచేయనున్నట్లు గుర్తించడంతో ఎస్‌ఈ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు జాగ్రత్తలపై సూచనలు చేశారు. అలాగే, విగ్రహాల అమ్మకం కేంద్రాలను కూడా తనిఖీ చేసిన ఆయన రవాణా విషయంలో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

**కేబుల్ వైర్లపై పర్యవేక్షణ**

విద్యుత్ స్తంభాలకు ఇష్టారాజ్యంగా అమర్చిన కేబుల్ వైర్ల నిర్వహణపై సమగ్ర చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన ఎస్‌ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇటీవల ప్రమాదాల దృష్ట్యా కేబుల్ వైర్లను నిబంధనల మేరకు అమర్చేలా సూచనలు చేయాలని, లేనిపక్షంలో తొలగించాలని సూచించారు. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే కేంద్రాలు, నిమజ్జన రూట్‌మ్యాప్‌లను పరిశీలించి విద్యుత్ లైన్ల కారణంగా ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. వీసీకి జిల్లా నుంచి ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తదితరులు హాజరయ్యారు.

# వర్షం జోరు.. ఫుల్లు నీరు!



కామంచికల్‌లో వంతెన వద్ద మున్నేటి పరవళ్లు

- అలుగు పోస్తున్న 70 శాతానికి పైగా చెరువులు
- ప్రాజెక్టుల్లోనూ పెరిగిన నీటి నిల్వలు

**ఖమ్మంఅర్బన్:** వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని చెరువులు, చిన్నాపెద్దా ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. జిల్లాలో కురుస్తున్న వర్షానికి తోడు ఎగువ నుంచి వరద వచ్చి చేరడంతో 70 శాతానికి పైగా చెరువులు అలుగు పోస్తున్నాయి. సాగర్ ఆయకట్టు పరిధిలోని 17మండలాల్లో చెరువులన్నీ దాదాపు అలుగులు పారుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మిగిలిన మండలాల్లోనూ పరిస్థితి ఆశాజనకంగా ఉండగా.. వానాకాలం పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రాజెక్టులు ఇలా...**

కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా, ప్రస్తుతం 22.20 అడుగులుగా నమోదైంది. ఇందులో 2.558 టీఎంసీల సామర్థ్యానికి గాను 2.413 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇక వైరా ప్రాజెక్టు 2.523 టీఎంసీల సామర్థ్యానికి గాను పూర్తిగా నిండి నీటిమట్టం 18.11 అడుగులుగా నమోదైంది. అలాగే, లంకాసాగర్‌లో 16 అడుగుల నీటిమట్టానికి గాను 15 అడుగుల మేర నీరు చేరగా.. 0.664 టీఎంసీల సామర్థ్యంలో 0.601 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

**గణనీయంగా ప్రవాహం**

ఆకేరు, మున్నేటి వాగుల్లోనూ ప్రవాహం గణనీయంగా కొనసాగుతోంది. ఆకేరుకు 6,700 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, తీర్థాల వద్ద 8,400–8,900 క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తోంది. ఇక మున్నేరు ఆక్వాడెక్ట్ వద్ద 6,200 క్యూసెక్కులు, పోలిశెట్టిగూడెం వద్ద 12,700 క్యూసెక్కులు, ఖమ్మం వద్ద మున్నేరు–ఆకేరు కలిసే ప్రదేశంలో 27,957 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. కాగా, మున్నేరు, ఆకేరులో వరద ప్రవాహం స్థిరంగానే ఉన్నప్పటికీ జల వనరుల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

**అలుగు స్థాయికి చెరువులు**

జిల్లాలోని మొత్తం 1,061 చెరువులకు గాను 70 శాతం పైగా చెరువుల్లోకి 75నుంచి 100శాతం నీరు చేరింది. ఇందులో 347 చెరువులు పూర్తిగా నిండి అలుగు పోస్తున్నాయి. 0–25 శాతం వరకు 38, 25–50శాతం 94, 50–75శాతం 132, 75–90శాతం 190, 90–100 శాతం మేర నీరు 260 చెరువుల్లోకి చేరిందని అధికారులు వెల్లడించారు.

**నీటి నిల్వకు ప్రయత్నించండి...**

వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న నేపథ్యాన నీరు వృథా కాకుండా సాధ్యమైనంత మేర చెరువులు, చెక్ డ్యాంలకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా ఇంజనీర్లతో సమీక్షించిన ఆయన వరద పరిస్థితి, చెరువులు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలపై ఆరా తీయడమే కాక నిల్వలపై సూచనలు చేశారు.

# లబ్ధిదారుల సమక్షాన పాడి పశువుల ఎంపిక

- ప్రతీ పశువుకు బీమా, జియో ట్యాగ్
- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

**ఖమ్మంమయూరిసెంటర్:** మధిర నియోజకవర్గంలో ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటులో భాగంగా పాడి పశువుల కొనుగోలులో నిబంధనలు పాటించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో మంగళవారం సమీక్షించిన ఆమె ఒక్కో లబ్ధిదారుకు రెండేసి పాడి పశువులు పంపిణీ చేసేలా కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడి వాతావరణంలో ఇమిడే పశువులను లబ్ధిదారుల ఆమోదంతో కొనుగోలు చేయాలని, ఆపై బీమా తప్పక చేయించడమే కాక ప్రతీ పాడి పశువుకు జియో ట్యాగ్ వేయాలని సూచించారు. వచ్చే శుక్రవారం నుంచి కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టాలని ఆమె తెలిపారు. డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**కోడిగుడ్ల సరఫరాకు టెండర్లు**

జిల్లాలోని గురుకుల విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా కోసం మూడు టెండర్లు దాఖలయ్యాయని అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లో టెండర్లను పరిశీలించాక ఆమె మాట్లాడారు. మూడు సంస్థల బాధ్యులు ఒక్కో గుడ్డుకు రూ.5.99, రూ.6.27, రూ.6.66కు కోట్ చేశారని, నిబంధనలు పాటిస్తూ తక్కువ ధరతో సరఫరా చేసే వారికి టెండరు ఖరారు చేస్తామని తెలిపారు. సాంఘిక సంక్షేమం, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల డీడీలు కస్తాల సత్యనారాయణ, జి.జ్యోతి, డాక్టర్ బి.పురంధర్, ఎస్.విజయలక్ష్మి, డీఈఓ కె.నాగపద్మజ, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీమ్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

**కట్టుదిట్టంగా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు**

**ఖమ్మం సహకారనగర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నిజేషన్ సిస్టమ్) ద్వారా కట్టుదిట్టంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో ఆమె హాజరు నమోదుపై సమీక్షించారు. విద్యాశాఖకు వచ్చే నిధుల వినియోగం, పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ, భవిత కేంద్రాల మరమ్మతులపై సూచనలు చేశాక అదనపు కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థుల గైర్హాజరుకు కారణాలు ఆరా తీయాలని, ఉపాధ్యాయులకు సెలవుల మంజూరులో ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులకు ఆగస్టు చివరి నాటికి అపార్ నంబర్ కేటాయించాలని తెలిపారు. డీఈఓ నాగపద్మజ, కోఆర్డినేటర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**గ్రంథాలయాల నిర్వహణకు పటిష్ట చర్యలు**

**ఖమ్మంగాంధీచౌక్:** గ్రంథాలయాల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం కలెక్టరేట్‌లో జరగగా ఆమె మాట్లాడారు. నేలకొండపల్లిలో నూతన భవన నిర్మాణం పూర్తయ్యేలా రూ.22.60లక్షలు, జిల్లా కేంద్రంలో అదనపు భవన నిర్మాణానికి ఈ ఏడాది రూ.1.50కోట్ల కేటాయింపు, పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలు తదితర అంశాలపై చర్చించారు. గ్రంథాలయ కార్యదర్శి కె.కరుణ, వయోజన విద్య డీడీ అనిల్, డీఈఓ నాగపద్మజ, డీపీఓ ఆశాలత, ఏపీఆర్‌ఓ అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### అదనపు కలెక్టర్‌కు డీఈఓ బాధ్యతలు?

**ఖమ్మం సహకారనగర్:** స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజకు డీఈఓగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని సమాచారం. ఇటీవల పలు జిల్లాల్లో డీఈఓ పోస్టులు ఖాళీ కాగా.. అదనపు కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించారు. కానీ ఖమ్మంలో మాత్రం జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మిని ఆ స్థానంలో నియమించారు. ఈనేపథ్యాన మంగళవారం అదనపు కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసినా.. స్పష్టత రావాల్సి ఉంది.

### 31వరకు దరఖాస్తులు

**ఖమ్మం సహకారనగర్:** తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ఈనెల 21వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ నాగపద్మజ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. అలాగే, అపరాధ రుసుముతో ఈనెల 31వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశముందని పేర్కొన్నారు. వివరాలకు 80084 03522 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# రాష్ట్రంలోనే రెండోస్థానంలో డీసీసీబీ

- బంగారం రుణాల్లో నంబర్–1
- బ్యాంకు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వరరావు, పక్కన డైరెక్టర్, సీఈఓ

**ఖమ్మంవ్యవసాయం:** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) రూ.3,743 కోట్ల లావాదేవీలతో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన బ్యాంకు ప్రగతిని వివరించారు. లావాదేవీల్లో రూ.7 వేల కోట్లతో కరీంనగర్ ప్రథమ స్థానంలో ఉండగా, ఆ తర్వాత స్థానం ఖమ్మంకు దక్కిందన్నారు. ఇక బంగారం తాకట్టు రుణాల్లో రూ.850 కోట్లతో ఖమ్మం బ్యాంకు ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఇటీవల కందుకూరు, అడసర్లపాడులో బ్రాంచ్‌లు ప్రారంభించగా, కరుణగిరి, చెరువుమాదారం బ్రాంచ్‌లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మంచుకొండ, సిరిపురంలోనూ ఏర్పాటుకు ప్రతిపాదించామని వెల్లడించారు. ఇదే సమయాన రైతుల సౌకర్యం కోసం సారపాక, అన్నపురెడ్డిపల్లి బ్రాంచ్‌లను నారాయణపురం, మొండికుంట(అశ్వాపురం)కు మార్చేందుకు నిర్ణయించామని తెలిపారు.

**పెరిగిన డిపాజిట్లు**

బ్యాంకు డిపాజిట్లు గతేడాదితో పోలిస్తే రూ.121 కోట్లు పెరిగి రూ.1,265 కోట్లకు చేరాయని చైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇక రుణాలు రూ.355 కోట్లు పెరిగి రూ.2,195 కోట్లకు చేరాయన్నారు. 2019–20లో రూ.7.23 కోట్ల నష్టాల్లో ఉన్న బ్యాంకు 2023–24లో లాభాల్లోకి రాగా.. 2024–25లో లాభాలు రూ. 5.30 కోట్లకు పెరిగాయని తెలిపారు. అలాగే, ఈ ఏడాది వానాకాలంలో రూ.923 కోట్ల పంట రుణాలు ఇచ్చామని, ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగుకు ఎకరాకు రూ.5 లక్షల చొప్పున రూ. 30 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇక బ్యాంకు ఉద్యోగులకు 26శాతం వేతనాలు(పీఆర్‌సీ) పెంచామని, సభ్యుల బీమా ప్రీమియంను రూ.19 నుంచి రూ.14కు తగ్గించామని తెలిపారు. కాగా, ఖమ్మం ఎన్‌ఎస్‌టీ, ఖమ్మం రూరల్ బ్రాంచ్‌ల్లో నకిలీ ధ్రువపత్రాలతో ఇచ్చిన మార్ట్‌గేజ్ రుణాల నుంచి కొంత రికవరీ జరిగిందని చెప్పారు. పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించి రైతులకు సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్ పి.రాంబ్రహ్మం, బ్యాంకు సీఈఓ ఎస్.వెంకట్ ఆదిత్య పాల్గొన్నారు.

# ఆర్‌అండ్‌బీ ఏఈఈలకు పదోన్నతి

**ఖమ్మంఅర్బన్:** ఆర్ అండ్ బీ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల(ఏఈఈ)కు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(డీఈఈ)గా పదోన్నతి లభించింది. రాష్ట్రంలో 15 మందికి పదోన్నతి కల్పించగా ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు ఉన్నారు. ఈమేరకు ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ ఖమ్మం ఏఈఈ మల్లారపు హరికృష్ణకు డీఈఈ పదోన్నతి కల్పించి ఇక్కడే పోస్టింగ్ ఇచ్చారు. ఈ సబ్ డివిజన్ పరిధిలో ఖమ్మంతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలు ఉంటాయి. అలాగే, చింతకాని ఏఈఈ లక్ష్మీనారాయణకు పదోన్నతి కల్పించి మరిపెడలో, పాల్వంచ ఏఈఈ వంశీ వీరేందర్‌ను సత్తుపల్లి డీఈఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుత పదోన్నతులతో ఇప్పటికే ఉన్న ఖాళీలు మరింతగా పెరిగినట్లయింది. ఉమ్మడి జిల్లాలో పదికి పైగా ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఉన్న వారికే రెండు, మూడు సెక్షన్ల బాధ్యతలు అదనంగా అప్పగించారు.

## క్లుప్తంగా

### జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక


గౌతమ్, గోపీచంద్


మైథిలి

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన ఏ.గౌతమ్, ఎస్.గోపీచంద్, ఎ.మైథిలి ఎంపికయ్యారు. ఇటీవల హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు ప్రతిభ చూపారు. దీంతో తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ఈనెల 20నుంచి అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రీడాకారులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ అభినందించారు.

### వైద్య, ఆరోగ్యశాఖ చట్టాలపై నేడు సదస్సు

ఖమ్మంవైద్యవిభాగం: వైద్య,ఆరోగ్యశాఖ చట్టాలపై అవగాహన కల్పించేందుకు బుధవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి తెలిపారు. చట్టాలు, వీటిని ఉల్లంఘిస్తే ఎదురయ్యే పరిణామాలపై వివరించే ఈ సదస్సు కలెక్టర్ అధ్యక్షతన జరుగుతుందని వెల్లడించారు. కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు మొదలయ్యే సదస్సుకు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, స్కానింగ్, డయాగ్నస్టిక్, ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వాహకులు, ప్రభుత్వ, ప్రైవేట్ రేడియోలజిస్టులు, గైనకాలజిస్టులు హాజరుకావాలని సూచించారు.

### ఆలయ షాప్‌ల వేలంతో రూ.98లక్షల ఆదాయం


టెండర్ బాక్స్ తెరుస్తున్న అధికారులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పలు దుకాణాల అప్పగింతకు మంగళవారం అధికారులు వేలం నిర్వహించారు. ఏడాది కాలానికి తలనీలాలు, కొబ్బరి చిప్పల సేకరణ, పొంగళ్లకు గ్యాస్ స్టౌల సరఫరా, వాహనాల పార్కింగ్, కొబ్బరికాయలు, బొమ్మల దుకాణాల నిర్వహణకు వేలం వేయగా రూ.98.79లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ కె.జగన్మోహన్‌రావు తెలిపారు. గత ఏడాది కంటే ఇది రూ.21.94లక్షలు అదనమని వెల్లడించారు. ఆలయ సూపరింటెండెంట్ విజయకుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

### నర్సరీల్లో నాణ్యమైన మొక్కలే పెంచాలి


మొక్కలను పరిశీలిస్తున్న మధుసూదన్

కూసుమంచి: నర్సరీల నిర్వాహకులు నాణ్యమైన మొక్కలే పెంచి రైతులకు అందించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి మధుసూధన్ సూచించారు. కూసుమంచి, కేశ్వాపురం, గోపాలరావుపేటల్లో నర్సరీలను మంగళవారం తనిఖీ చేసిన ఆయన మొక్కల నాణ్యతను పరిశీలించి మాట్లాడారు. నర్సరీల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి రైతులు నష్టపోవడానికి కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాలేరు ఉద్యానవన శాఖ అధికారి అపర్ణ పాల్గొన్నారు.

### నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. గర్భగుడిలో స్వామికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| కందులు | 5,950 | 5,950 |
| ఏసీ మిర్చి | 14,550 | 8,000 |
| మిర్చి | 8,600 | 6,000 |
| పత్తి | 7,700 | 7,700 |

– ఖమ్మం వ్యవసాయం

### పామాయిల్ గెలలు

| | |
|---|---|
| టన్ను ధర | రూ.18,052 |

# జమలాపురానికి దేవుడే దిక్కు

- ట్రస్ట్ బోర్డు లేక అభివృద్ధిపై నీలినీడలు
- దాతలు ముందుకొస్తేనే ఆలయంలో పనులు
- పూర్తిస్థాయి ఈఓ కూడా లేక కొరవడిన పర్యవేక్షణ


జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. దశాబ్దాలుగా పాలకుల పట్టింపు లేక.. ఏటా రూ.4కోట్ల నికర ఆదాయం ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో ముందుడుగు పడడం లేదు. రాష్ట్ర మంత్రులు ఆలయంలో శ్రీవారిని దర్శించుకుని వెళ్లడమే తప్ప ప్రభుత్వం నుంచి రూపాయి కూడా కేటాయించకపోవడంపై భక్తుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు దాతలు రూ.కోట్లాది నిధులతో నిర్మాణాలు చేపట్టి ఆలయానికి అప్పగించారు. ఇవి తప్ప ప్రభుత్వపరంగా చొరవ మాత్రం కానరావడం లేదు. మధిర నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాలని భక్తులు కోరుతున్నారు.

**పాలకమండలి ఏర్పాటులో జాప్యం**

ఆలయాల అభివృద్ధికి పాలక మండళ్లు(ట్రస్టు బోర్డు) కృషి చేస్తాయి. కానీ దశాబ్దకాలంగా జమలాపురం ఆలయానికి పాలకమండలి లేకపోవడం గమనార్హం. ఈ ఆలయానికి చైర్మన్‌గా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలే వ్యవహరిస్తుండగా.. పాలక మండలి సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంది. అది కూడా జరకపోవడం, గత ఏడాది నుండి మూడు సార్లు నోటిఫికేషన్ జారీ చేసినా నియామకం చేపట్టకపోవడం గమనార్హం. పాలక మండలి ఉంటే ఆలయ అభివృద్ధికి సూచనలు చేయడమే కాక దాతల నుంచి నిధుల సేకరణకు అవకాశం ఉండేది.

**ఆరింటిలో ఇదొకటి..**

ఆదాయం విషయంలో గణనీయంగా పురోగతి సాధిస్తున్న జమలాపురం ఆలయానికి ఈఓగా అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాల్సి ఉంది. కానీ ఇన్‌చార్జి ఈఓతోనే సరిపెడుతున్నారు. ప్రస్తుత ఇన్‌చార్జ్ ఈఓ కొత్తూరి జగన్మోహన్‌రావుకు ఖమ్మంలోని స్తంభాద్రి ఆలయం, మారెమ్మ ఆలయం, కూసుమంచి మండలం జీళ్లచెరువులోని రామాలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, మధిరలోని మృత్యుంజయస్వామి వారి ఆలయాల బాధ్యతలు కూడా కట్టబెట్టడంతో జమలాపురం ఆలయ పర్యవేక్షణ కింది స్థాయి ఉద్యోగులే చూసుకోవాల్సి వస్తోంది. వారానికి ఒకటి, రెండు రోజులు మాత్రమే ఇన్‌చార్జి ఈఓ వచ్చివెళ్తుండడం.. పాలక మండలి కూడా లేకపోవడంతో ఆలయ అభివృద్ధి విషయంలో పురోగతి కానరావడం లేదు.

**పాలకులు శ్రద్ధ వహించాలి**



జమలాపురం ఆలయ అభివృద్ధిపై పాలకులు శ్రద్ధ చూపాలి. ఆదాయం ఉన్నా అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. ఫలితంగా వచ్చిన భక్తులకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వమే నిధులు మంజూరు చేసి ఆలయ అభివృద్ధి, వసతుల కల్పనపై దృష్టి సారించాలి.

– దేవంబొట్ల మధుసూధన్‌శాస్త్రి, రేమిడిచర్ల

**ప్రభుత్వం నిధులు కేటాయించాలి**



చిన్న తిరుపతిగా పేరొందిన జమలాపురం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నేరుగా నిధులు కేటాయించాలి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పట్టించుకోవడం లేదు. ఇకనైనా నిధులు కేటాయించడమే కాక దాతలు ఇచ్చిన విరాళాలను సక్రమ పద్ధతిలో వినియోగించాలి.

– వేమిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, మధిర

**త్వరలోనే నోటిఫికేషన్**



ఆలయ పాలకమండలి ఏర్పాటుకు ఏడాది కాలంలో మూడు సార్లు నోటిఫికేషన్ ఇచ్చినా ఎవరూ ముందుకు రాక రద్దయ్యాయి. మరోమారు త్వరలోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశముంది. ఇన్‌చార్జి ఈఓగా ఉన్నా వీలైనంత మేర అందుబాటులో ఉంటూ పర్యవేక్షిస్తున్నా.

– కె.జగన్మోహన్‌రావు, ఇన్‌చార్జ్ ఈఓ

# ప్రతిభకు పరీక్ష



- సైన్స్‌పై ఆసక్తి పెంచేలా 'వీవీఎం'
- 6 నుంచి ఇంటర్ విద్యార్థులకు అవకాశం

ఖమ్మంసహకారనగర్: సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి పెంచడం, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేలా విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) కార్యక్రమాన్ని రూపొందించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థుల కోసం నిర్వహించే ఈ పరీక్ష దేశంలో అతిపెద్ద సైన్స్ టాలెంట్ సెర్చ్‌గా పేరు సాధించింది. శాస్త్రీయ దృక్పథం ఉన్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించడం ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశం కాగా.. 100 మార్కులకు ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి, అక్కడ విజేతలుగా నిలిచిన వారిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు.

**రిజిస్ట్రేషన్ ఇలా..**

వీవీఎం పరీక్షలో పాల్గొనేందుకు సెప్టెంబర్ 30వ రకు రూ.200 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఆరో తరగతి మొదలు ఇంటర్ విద్యార్థులకు విడివిడిగా పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ తదితర భారతీయ భాషల్లో పరీక్ష రాసే వెసలుబాటు ఉంది. ఇక అక్టోబర్ 23 లేదా 27వ తేదీల్లో పరీక్ష నిర్వహించి నవంబర్ 15న ఫలితాలు ప్రకటిస్తారు. ఆపై డిసెంబర్ 8, 15, 22తేదీల్లో ఒకరోజు రాష్ట్ర శిబిరం, మే 17, 18వ తేదీల్లో జాతీయ శిబిరం ఉంటుంది.

**ఎంపిక పోటీలు**

వచ్చేనెల 1 నుంచి మాక్ పరీక్షలు నిర్వహిస్తారు. పాఠశాల స్థాయి ప్రధాన పరీక్ష అక్టోబర్ 28 నుంచి 30 వరకు ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైన వారికి లెవల్-2 పరీక్ష ఆన్‌లైన్‌లో పరిశీలకుల సమక్షాన నవంబర్ 19న నిర్వహిస్తారు. పాఠశాల స్థాయి పరీక్షలో తరగతుల వారీగా ప్రతిభచూపిన మొదటి 25 మందిని ఎంపిక చేస్తారు. మొత్తంగా 150 మందిని ఎంపిక చేసి, అందులో ప్రతిభ చూపిన ప్రతీ తరగతి నుంచి ముగ్గురు చొప్పున 18మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతీ తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతోపాటు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేస్తారు. ఇక జాతీయ స్థాయి విజేతలకు వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలే కాక మెమెంటో, ప్రశంసా పత్రం ఇస్తారు. ఇదికాక నెలకు రూ.2వేల చొప్పున ఏడాది పాటు ఉపకార వేతనం అందుతుంది. అలాగే ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో మూడు వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

**సృజనాత్మకతను వెలికితీసేందుకే..**



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఉపయోగపడుతుంది. జాతీయస్థాయి పరీక్షల్లో ప్రతిభ చూపితే ప్రఖ్యాత సంస్థల్లో ఇంటర్న్‌షిప్ లభిస్తుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పోటీతత్వాన్ని పెంచుకునేందుకు ఈ పరీక్ష దోహదపడుతుంది.

– పెసర ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్

## గ్రానైట్ పరిశ్రమ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో గ్రానైట్ పరిశ్రమను పరిరక్షించేలా అవసరమైతే ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పలువురు సూచించారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెంచిన రాయల్టీ, పర్మిట్, సీవరేజ్ చార్జీల ఉపసంహరణ, వైఎస్సార్ హయాంలో ఇచ్చిన 40శాతం సబ్సిడీ పునరుద్ధరణ, పెండింగ్ ఉన్న రూ.20కోట్ల సబ్సిడీ విడుదల, గ్రానైట్ ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపుపై చర్చించారు. ఈమేరకు సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమలో సంక్షోభాన్ని పరిష్కరించి కార్మికుల జీవనోపాధికి ఇబ్బంది ఎదురుకాకుండా చూడాలని కోరారు. జిల్లాలోనే పరిశ్రమపై ఆధారంగా ప్రత్యక్షంగా 35వేల మంది, పరోక్షంగా లక్ష మంది ఉపాధి పొందుతున్నందున రాయల్టీ పెంపు, అధిక విద్యుత్ చార్జీల సమస్య ఎదురుకాకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సున్నా నాగేశ్వరరావు సూచించారు. కాగా, గ్రానైట్ రంగాన్ని ఆదాయ వనరుగా కాకుండా ఉపాధి కోణంలో చూడాలని గ్రానైట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్ కోరారు. ఇంకా సీపీఐ, బీఆర్‌ఎస్, మాస్‌లైన్ నాయకులు శింగు నర్సింహారావు, ఉప్పల వెంకటరమణ, గోకినేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడగా గ్రానైట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కమర్తపు గోపాలరావుతో పాటు వివిధ పార్టీలు, అసోసియేషన్ల నాయకులు రాజారావు, మాదినేని రమేష్, బండిరమేష్, విష్ణు, కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాస్, బోడపట్ల సుదర్శన్, జబ్బార్, తమ్మినేని కోటేశ్వరరావు, మోరంపూడి పరమేశ్వరరెడ్డి, బుగ్గవీటి శ్రీధర్, పారా నాగేశ్వరరావు, వేముల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవుపేడ పొడితో గణపతి విగ్రహాలు

- నిమజ్జనం తర్వాత ఎరువుగా ఉపయోగం
- గోశాల నిర్వాహకుల వినూత్న ప్రయత్నం


గోవు పేడ పొడితో చేసిన విగ్రహం


అమ్మకానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు

ఖమ్మంఅర్బన్: ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం ద్వారా జలాశయాలు కలుషితమవుతున్నాయి. ఈ విషయమై అవగాహన పెరగడంతో కొన్నేళ్లుగా చాలామంది మట్టితో చేసిన ప్రతిమలను పూజిస్తున్నారు. ఈక్రమంలో ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లిలోని శ్రీ వెంకటేశ్వర గోశాల నిర్వాహకులు ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, ఆరుట్ల శ్రీరామ్ ఇంకో అడుగు ముందుకేశారు. గోశాలలో పెద్దసంఖ్యలో ఆవులను సంరక్షిస్తుండగా.. వీటి పేడను ఎండబెట్టి పొడిగా మార్చి వినాయక విగ్రహాలు రూపొందిస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా తయారుచేసే ఈ ప్రతిమలను పూజలు చేశాక నిమజ్జనం చేస్తే నేలలో కలిసి ఎరువులుగా మారతాయి. ఒక్కో విగ్రహాన్ని రూ.100తో విక్రయిస్తుండడంతో భక్తులు కొనుగోలుకు ముందుకొస్తున్నారు. ఇలా వచ్చే ఆదాయాన్ని గోశాలలోని పశువుల దాణా, సంరక్షనకు వినియోగిస్తున్నామని శ్రీనివాసాచార్యులు తెలిపారు. కాగా, గతంలో ఆవుపేడ పొడితో రాఖీలు, దీపాంతలు కూడా తయారుచేశారు. అంతేకాక గోమూత్రంతో ఫినాయిల్ తయారుచేసి విక్రయిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

## వెబినార్‌లో తిరుమలాయపాలెం విద్యార్థిని

మట్టి గణపతి ప్రాముఖ్యతను వివరించిన భవ్యశ్రీ


మట్టి విగ్రహాలతో ఉపాధ్యాయులు, భవ్యశ్రీ

తిరుమలాయపాలెం: కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వెబినార్‌లో తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎం.భవ్యశ్రీ పాల్గొంది. తెలంగాణలో 13 జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొనగా.. భవ్యశ్రీ రానున్న వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపన ఆవశ్యకతను వివరించింది. ప్రత్యక్షంగా మట్టి విగ్రహాలను తయారుచేస్తూ మాట్లాడిన ఆమెను జ్యూరీ సభ్యులు అభినందించారు. కాగా, రాష్ట్రస్థాయి వెబినార్‌లో ఉపాధ్యాయులు పెసర ప్రభాకర్‌రెడ్డి, తెప్పల్లి శ్యామ్‌కుమార్ సహకారంతో పాల్గొన్న భవ్యశ్రీని ఎంఈఓ శ్రీనివాసరావు, హెచ్‌ఎం విజయకుమారి అభినందించారు.

### కుంగిన రహదారి


వాగు వద్ద కుంగిన రహదారి

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం వాగు వద్ద ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారి కొంత భాగం కుంగిపోయింది. ఇటీవల వరుస వర్షాలతో వాగు నీరు రహదారిపైకి చేరి ఉధృతంగా ప్రవహించింది. దీంతో రహదారి కుంగిపోయినట్లు తెలుస్తోంది. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

## మార్కెట్ యార్డుల అభివృద్ధిపై దృష్టి

మధిర మార్కెట్‌లో నిరంతరం కొనుగోళ్లు


ఎర్రుపాలెంలో చర్చిస్తున్న జేడీఎం శ్రీనివాస్

మధిర/ఎర్రుపాలెం: మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో నిరంతరం కార్యకలాపాల నిర్వహణకు సాధ్యాసాధ్యాలపై మంగళవారం చర్చించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ పాల్గొనగా చైర్మన్ బండారు నర్సింహారావు, కోల్డ్ స్టోరేజీల యాజమాన్యాలు, వ్యాపారులు హాజరయ్యారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకుని నిరంతరం కొనుగోళ్లు చేయడం ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందని జేడీఎం తెలిపారు. అనంతరం శ్రీనివాస్ ఎర్రుపాలెంలోని గోదాంలను పరిశీలించి, అక్కడ చేయాల్సిన అభివృద్ధిపై పనులపై చర్చించారు. అలాగే, రాజుపాలెం వద్ద చెక్‌పోస్టును కూడా పరిశీలించారు. మార్కెట్ డైరెక్టర్లు గుడేటి బాబురావు, వేమిరెడ్డి అనురాధ, యన్నం పిచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రెండోరోజూ అవే బారులు


యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

తల్లాడ: తల్లాడ పీఏసీఎస్‌లో రెండో రోజైన మంగళవారం కూడా యూరియా కోసం రైతులు క్యూ కట్టారు. సొసైటీకి 911 బస్తాల యూరియా రాగా కూపన్ల ద్వారా ఏఓ ఎం.డీ.తాజుద్దీన్, ట్రెయినీ ఎస్‌ఐ వెంకటేశ్, సీఈఓ నాగబాబు సమక్షాన పంపిణీ చేశారు. అయితే సొసైటీ పరిధిలో భార్యాభర్తల పేరిట భూమి ఉంటే ఇద్దరూ వచ్చి వేలిముద్ర వేయాలనే నిబంధన విధించారు. దీంతో రెండేసి బస్తాల యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వచ్చింది. కాగా, భార్యాభర్తలిద్దరూ రావాలనే నిబంధన సడలించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. యూరియా పంపిణీని పార్టీ నాయకులు ఆపతి వెంకటరామారావు తదితరులు పరిశీలించి తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏడీఏ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు గాదె కృష్ణారావు, కామినేని శ్రీనివాసరావు, పులి వీరయ్య, దావీదు, రామారావు, నరేష్ పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లతో చేపలు వేటాడుతూ మృతి

చింతకాని: విద్యుత్ వైర్ల సాయంతో చేపలు పడుతున్న వ్యక్తి ప్రమాదవశాత్తు షాక్‌కు గురై మృతి చెందాడు. మండలంలోని అనంతసాగర్‌కు చెందిన డేగల భాస్కర్‌రావు(39) ఊట వాగులో విద్యుత్ వైర్ల సాయంతో మంగళవారం చేపలు పడుతున్నాడు. ఈక్రమాన నీటిలో జారి పడడడంతో చేతిలో ఉన్న విద్యుత్ వైర్లు ఆయనపై పడగా షాక్‌కు గురయ్యాడు. సమీపానే ఉన్న భాస్కర్‌రావు కుటుంబీకులు ఆయనను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన భార్య రమాదేవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

### ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

కల్లూరు: కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. హాస్టల్‌లో ఇటీవల రెండుసార్లు ఫుడ్‌పాయిజన్ కావడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆహార పదార్థాలు, వంట సామగ్రి నాణ్యతను తహసీల్దార్ పులి సాంబశివుడుతో కలిసి తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంపిళ్లను సేకరించా రు. అలాగే, ఇన్‌చార్జ్ వార్డెన్ శ్రీనివాసరావు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. కాగా, హాస్టల్‌లో పనిచేసిన కుక్, హెల్పర్లను సత్తుపల్లికి బదిలీ చేయగా.. సత్తుపల్లి, వైరానుంచి కుక్, హెల్పర్లను కేటాయించారు.

### చేపల వేటకు వెళ్లి గల్లంతు


వినోద్ (ఫైల్)

మధిర: వరదలతో చేపలు కొట్టుకొస్తుండగా వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన మధిర సమీపాన వైరా నదిలో మంగళవారం చోటుచేసుకుంది. మడుపల్లికి చెందిన పెసరమల్లి వినోద్(28) చేపలు పట్టేందుకు వైరా నది వద్దకు వెళ్లాడు. ఈక్రమాన నదిలోకి దిగిన ఆయన ప్రవాహానికి కొట్టుకుపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆరా తీస్తుండగా చేపల వేటకు వెళ్లినట్లు తెలుసుకున్నారు. దీంతో రాత్రి వరకు గాలించినా ఫలితం లేకపోగా.. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు బుధవారం రానున్నట్లు తెలిసింది.

### విచ్చలవిడిగా వ్యవహరిస్తే కేసులు

ఖమ్మంక్రైం: బహిరంగ మద్యపానం, వేగంగా వాహనాలు నడిపే వారితో పాటు నిర్ణీత సమయానికి మించి షాప్‌లు తెరిచినా, నడిరోడ్లపై వేడుకలు నిర్వహించినా సిటీ పోలీస్ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని నగర ఏసీపీ రమణమూర్తి హెచ్చరించారు. అలాగే, చోరీ కేసులను త్వరగా ఛేదించేలా మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ బృందాల ద్వారా వేగంగా దర్యాప్తు చేసేలా సీసీ కెమెరాల పుటేజీ సేకరిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, గంజాయి సరఫరా, వినియోగాన్ని సమూలంగా నియంత్రించేలా విస్తృత తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఈమేరకు ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో ఖమ్మం డివిజన్‌లో 38 కేసులు నమోదు చేసి 167మందికి గాను 114 మందిని అరెస్ట్ చేశామని చెప్పారు. వీరి నుంచి రూ.11లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

### తాలిపేరుకు కొనసాగుతున్న వరద

చర్ల: ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురుస్తుండగా భద్రాద్రి కొత్తగూడెంజిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం 21,387 క్యూసెక్కుల చొప్పున వరద నీరు రాగా, 10 గేట్లు ఎత్తి 20,759 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువన ఉన్న గోదావరిలోకి విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లకు గాను ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న దృష్ట్యా 71.84 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నామని ఇంజనీర్లు వెల్లడించారు.

## రాష్ట్రపతి అవార్డు గ్రహీత దుగ్గినేని మృతి


సత్యనారాయణరావు (ఫైల్)

ఖమ్మం సహకారనగర్/మధిర: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా నాటి రాష్ట్రపతి డాక్టర్ శంకర్‌దయాళ్‌శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయ ఉద్యమ నేత దుగ్గినేని సత్యనారాయణరావు(94) మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో మృతి చెందారు. మధిర మండలం ఇల్లూరుకు చెందిన ఆయన 1955లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. మధిర ఉన్నత పాఠశాలతో పాటు ఉపాధ్యాయ శిక్షణా కేంద్రంలో విధులు నిర్వర్తించడమే కాక రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగానూ పనిచేశారు. కాసు బ్రహ్మానందరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కరువుభత్యం కోసం 56 రోజుల పాటు జరిగిన సమ్మెకు దుగ్గినేని నేతృత్వం వహించారు. ఆయన 29 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేశాక 1984లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి శాసన మండలికి పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. అలాగే, దుగ్గినేని చేకూరి కాశయ్యతో కలిసి ఖమ్మంలో గురుదక్షిణ ఫౌండేషన్ స్థాపించారు. అంతేకాక మధిర టీవీఎం ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకలను సత్యనారాయణరావు సొంత ఖర్చులతో నిర్వహించారు. ఆయన మృతిపై మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ప్రసాదరావు, ఎస్.కే.కరీం, గురుదక్షిణ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్య, చావా శ్రీనివాసరావు, విశ్రాంత ఎంఈఓ దుగ్గినేని శ్రీనివాసరావు, రామానుజస్వామి తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు.

### పోలీసుస్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

కారేపల్లి: అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి ఇవ్వడం లేదనే ఆవేదనతో ఓ వ్యక్తి మంగళవారం సాయంత్రం కారేపల్లి పోలీసుస్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కారేపల్లి క్రాస్ రోడ్డుకు చెందిన పాలెపు భద్రం అదే గ్రామానికి చెందిన ఉపేందర్‌కు రూ.5లక్షలు అప్పుగా ఇచ్చాడు. అయితే, ఎన్నిసార్లు అడిగినా డబ్బు ఇవ్వకపోగా పెద్దల సమక్షాన నిర్వహించినా ఫలితం కానరాలేదు. దీంతో భద్రం కారేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చి అక్కడే వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు కారేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.